క్లుప్తంగా

మత్స్యకారులకు లైఫ్ జాకెట్లు పంపిణీ



లైఫ్ జాకెట్‌లు అందిస్తున్న ఎంపీడీఓ రూతమ్మ

వేటపాలెం: రామచంద్రాపురం మత్స్యకారులకు లైఫ్ జాకెట్లను ఎంపీడీఓ రూతమ్మ శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద సీ సేఫ్టీ పరికరాల కోసం దరఖాస్తు చేసుకున్న మత్స్యకారులకు 75 శాతం రాయితీపై అందజేశామని తెలిపారు. వేటకు వెళ్లే ప్రతి బోటులో సీ సేఫ్టీ పరికరాలను తప్పనిసరిగా ఉంచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఫిషరీస్ అసిస్టెంట్, సాగరమిత్ర పాల్గొన్నారు.

చినగంజాంలో బాలుడు అదృశ్యం



వెంకటేష్ (ఫైల్)

చినగంజాం: ఊరు వెళ్తున్నానని చెప్పిన బాలుడు అదృశ్యమయ్యాడు. పోలీసుల వివరాల మేరకు.. అనంతపురంలో తల్లిదండ్రుల వద్ద ఉంటున్న పనికిపోగు వెంకటేష్ ఈనెల 12వ తేదీ చినగంజాం మహాలక్ష్మి కాలనీలో తాతను చూసేందుకు వచ్చాడు. మళ్లీ తిరిగి 13వ తేదీ అనంతపురం వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడు. కాని వెంకటేష్ అనంతపురం రాకపోవడంతో అతని తల్లి కోటేశ్వరమ్మ చినగంజాం వచ్చి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



కారును తొలగిస్తున్న పోలీసు సిబ్బంది

జే.పంగులూరు: ముందు వెళ్తున్న లారీని కారు ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈఘటన జాగర్లమూడివారిపాలెం ఫ్లైఓవర్‌పై శుక్రవారం రాత్రి జరిగింది. అందిన వివరాల మేరకు.. ఒంగోలు వైపు నుంచి మిరపకాయలు లోడుతో గుంటూరు వైపు మినీలారీ వెళ్తోంది. అదే మార్గంలో నెల్లూరు వైపు నుంచి గుంటూరు వెళ్తున్న ఇన్నోవా కారు వెళ్తోంది. ఈ రెండు వాహనాలు ఫ్లైఓవర్ వద్దకు రాగానే కారు వెనుకవైపు నుంచి లారీని బలంగా ఢీకొట్టింది. కారులోని అనీల్‌కుమార్, లారీ డ్రైవర్ బంది నరేష్‌కు స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను హైవే అంబులెన్స్ సహాయంతో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రమాదంలో రోడ్డు అడ్డంగా పడ్డ వాహనాలను రేణింగవరం పోలీసులు, నైట్ రౌండ్స్ ఎస్ఐ చంద్రశేఖర్ (మేదరమెట్ల) క్రేన్ సాయంతో ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా చూశారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట



మందులు పంపిణీ చేస్తున్న అధికారులు

యద్దనపూడి: పేద ప్రజలకు కార్పోరేట్ వైద్యాన్ని అందించి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టిందని వైద్యాధికారి శ్రీహర్ష అన్నారు. మండలంలోని తనుబొద్దివారిపాలెం సచివాలయ ఆవరణలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష–2 వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, పల్మనాలజిస్ట్, కంటి వైద్యనిపుణులు, జనరల్ మెడిసిన్ వైద్యబృందంతో 345 మందికి వైద్యసేవలు, రక్త పరీక్షలు చేశారు. వైద్యులు భవానిదేవి, సాయిప్రసాద్‌రావు, కరీమ్‌బాషా, సర్పంచ్ చల్లా అన్నపూర్ణమ్మ, వైద్యసిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ సత్యనారాయణ

వేటపాలెం: ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని చీరాల రూరల్ సీఐ నిమ్మగడ్డ సత్యనారాయణ ఆదేశించారు. స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో ఆటో డ్రైవర్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. లైసెన్స్ లేకుండా ఆటో నడిపినా లేదా మద్యం తాగి ఆటో నడిపినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఆటోల్లో నిషేధిత వస్తువులు తరలించరాదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐఎస్సై జి సురేష్, సిబ్బంది ఉన్నారు.

● సీఎం జగన్ మోహన్‌రెడ్డిని కలిసిన నాయకులు







సాక్షి నెట్‌వర్క్: ఇళ్ల స్థల పట్టాల పంపిణీ కోసం ప్రకాశం జిల్లా ఒంగోలుకు వచ్చిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని శుక్రవారం చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణ మూర్తి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం వెంకటేష్, డీసీఎంఎస్ చైర్మన్ రావి పద్మావతి, రామనాథం దంపతులు, ఎమ్మెల్సీ పోతుల సునీత, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి వరికూటి అమృతపాణి, అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి, అద్దంకి నియోజవకర్గ పరిశీలకుడు మారం వెంకారెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

ఎన్నికలకు అధికారుల సిద్ధం

- ఎన్నికల విధుల్లో నిమగ్నమైన అధికారులు
- అన్ని ఏర్పాట్లు పూర్తి
- సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచిన పోలీసులు



ఎన్నికల విధులపై అధికారులకు సూచనలందిస్తున్న ఆర్వో సూర్యనారాయణరెడ్డి (ఫైల్)

చీరాల టౌన్: మరికొన్ని రోజుల్లో సార్వత్రిక ఎన్నికల జాతర మొదలు కాబోతోంది. ఐదేళ్ల తర్వాత ఎన్నికలు వస్తుండటంతో అధికారులు అంతా సిద్ధం అవుతున్నారు. కొత్త ఓటర్ల రాకతో ఓటుకు మరింత కళ వచ్చినట్లయింది. ఎన్నికలను ప్రశాంత వాతావరణలో సక్రమంగా జరిపించేందుకు అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అన్నీశాఖల సెక్టోరియల్ అధికారులు చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు చీరాల నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్డీవో జి.సూర్యనారాయణరెడ్డి ప్రత్యేక చర్యలు చేపడుతన్నారు. ఆర్వో ఎన్నికలకు సంబంధించిన సిబ్బంది, వీడియో గ్రాఫర్లు, ఖర్చుల విభాగం, మానిటరింగ్, స్టాటిస్టిక్స్ విభాగాలను కూడా నియమించారు. నియోజకవర్గ పరిధిలో ఎన్నికలకు 22 మందిని సెక్టోరియల్ అధికారులుగా, రూట్ ఆఫీసర్లు, మాస్టర్ ట్రైనర్లను కూడా నియమించారు. చీరాల నియోజకవర్గంలో చీరాల మున్సిపాలిటీ, చీరాల రూరల్, వేటపాలెం మండలాలు ఉన్నాయి. 2024 సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎన్నికల సంఘం ఓటర్ల తుది జాబితాను విడుదల చేసింది. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 1,98,643 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 96,856, మహిళా ఓటర్లు 1,01,767 మంది ఉన్నారు. పురుష ఓటర్లు కంటే మహిళా ఓటర్లు 4911 అధికంగా ఉన్నారు. ఈ దఫా ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి గెలుపునకు మహిళా ఓటర్లు కీలకంగా మారనున్నారు. నియోజకవర్గంలో ఎన్నికలకు సంబంధించి 218 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పురపాలక సంఘంలో 33 వార్డులు, చీరాల రూరల్ మండలంలో 15 గ్రామ పంచాయతీలు, వేటపాలెం మండలంలో 9 గ్రామ పంచాయతీలు ఉన్నాయి.



ప్రజలకు అవగాహనకల్పిస్తున్న ఎస్సై శివకుమార్

> **అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం..**
>
> 
>
> చీరాలలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు పూర్తిచేసేలా అన్నీ ఏర్పాట్లు, చర్యలు తీసుకున్నాం. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు విధిగా నిబంధనలు పాటిస్తూ పోలింగ్ బూత్‌ల్లో సౌకర్యాలు కల్పించాం. సమస్యాత్మక గ్రామాలు, వార్డులపై నిత్యం నిఘా ఉంచాం. సెక్టోరియల్ అధికారులకు కేటాయించిన విధులను పర్యవేక్షిస్తున్నాం. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీలు కూడా సహకరించాలి.
>
> – జీ సూర్యనారాయణరెడ్డి, నియోజకవర్గ ఎన్నికల అధికారి

సమన్వయంతో పనిచేస్తున్న అధికారులు..

సార్వత్రిక ఎన్నికల విధుల కోసం నియమించిన సెక్టోరియల్ అధికారులు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాల పనితీరు, వసతులు అన్నీ ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. సెక్టోరియల్ అధికారి పరిధిలో సమస్యాత్మక గ్రామాలు, వార్డుల్లోని పరిస్థితులు గుర్తించి నివేదికలు అందిచారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామాలు, వార్డులను గుర్తిస్తే ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పోలీసు బందోబస్తు, లైవ్ వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేస్తామని ఆర్వో తెలిపారు. సెక్టోరియల్ అధికారి, పోలీసు సిబ్బంది విధిగా అందుబాటులో ఉండి ఎన్నికల విధులు నిర్వహించేందుకు అన్నీ ఏర్పాటు చేస్తున్నారు. పోలీసు బందోబస్తు ఏర్పాట్లు, ఎంఎంసీ బృందాలు, నిఘా బృందాలు అన్నీ అప్రమత్తంగా పనిచేయాలన్నారు. గత ఎన్నికల్లో అల్లర్లు, గొడవలు చేసిన వ్యక్తులు, నేర చరిత్ర కలిగిన వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా గ్రామాల్లో పోలీసులు సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. ఏఈఆర్వోలు తహసీల్దార్ కె.నాసరయ్య, మున్సిపల్ కమిషనర్ విజయ్‌సారథిలతో సమన్వయం చేసుకుంటూ సెక్టోరియల్ అధికారులతో నియోజకవర్గ ఆర్వో సూర్యనారాయణ రెడ్డి సమావేశాలు నిర్వహిస్తున్నారు.

నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలు	218
మొత్తం ఓటర్లు	1,98,643
పురుషులు	96,856
స్త్రీలు	1,01,767
థర్డ్ జండర్	20
చీరాల మున్సిపాలిటీ ఓటర్లు	68,330
పురుషులు	32,978
స్త్రీలు	35,352
చీరాల మండలంలోని ఓటర్లు	69,102
పురుషులు	33,969
స్త్రీలు	35,119
వేటపాలెం మండలంలోని ఓటర్లు	61,211
పురుషులు	29,909
స్త్రీలు	31,296
మొత్తం పోలింగ్ కేంద్రాలు	218

నేడు పర్చూరులో పార్టీ కార్యాలయం ప్రారంభం



పర్చూరులో పార్టీ కార్యాలయం ఏర్పాట్లు పరిశీలిస్తున్న బాలాజీ



సమన్వయకర్త బాలాజీని కలిసిన పర్చూరు ఎస్సీ నాయకులు

పర్చూరు (చినగంజాం): పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన యడం బాలాజీ తన కార్యాలయాన్ని పర్చూరులో శనివారం ప్రారంభించనున్నట్లు పార్టీ వర్గాలు శుక్రవారం తెలిపాయి. సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యుడు, జిల్లా పార్టీ అధ్యక్షుడు మోపిదేవి వెంకటరమణ హాజరు కానున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి అందరూ హాజరు కావాలని వారు కోరారు. ఈసందర్భంగా పార్టీ కార్యాలయ ఏర్పాటు పనులను యడం బాలాజీ పరిశీలించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ కొల్లా వెంకటరావు, మండల పార్టీ కన్వీనర్ కఠారి అప్పారావు, చినగంజాం మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానందరెడ్డి, గాదె సురేష్, తదితరులు పాల్గొన్నారు.

బాలాజీని కలిసిన పర్చూరు ఎస్సీ నాయకులు..

నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన యడం బాలాజీని పర్చూరుకు చెందిన పలువురు ఎస్సీ నాయకులు శుక్రవారం ఆయన నివాస గృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనను కలిసిన వారిలో ఎస్సీ సెల్ అధ్యక్షుడు కట్టా రత్నం రాజు, కూరాకుల ఇస్సాక్ బాబు, కొల్లావారిపాలెం ఎంపీటీసీ బుజ్జిబాబు, రాష్ట్ర విద్యావిభాగం కార్యదర్శి మాచవరపు రవికుమార్, బండి రాంబాబు, బత్తుల ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.

నేడు అర్బన్ హెల్త్ సెంటర్ ప్రారంభం

- ప్రారంభించనున్న ఎమ్మెల్యే కరణం, నియోజవర్గ సమన్వయకర్త వెంకటేష్



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్

చీరాల రూరల్ : పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ ప్రధాన కార్యాలయం పక్కన మున్సిపల్ స్థలంలో రూ.1,20 కోట్లు వెచ్చించి డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను నేడు శనివారం ప్రారంభించనున్నారు. స్థానిక ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ చేతులు మీదుగా సాయంత్రం 5 గంటలకు ప్రారంభించనున్నారు. ఈ హెల్త్ సెంటర్ నిర్మాణానికి ఎమ్మెల్యే రెండేళ్ల క్రితం భూమిపూజ నిర్వహించారు. వైద్యశాలకు కావాల్సిన హంగులతో అత్యాధునికతను మేళవించి ప్రారంభించారు. వైద్యుల గదులు, పేషంట్స్ వార్డులు, వైద్య పరికరాల గదులు, మరుగుదొడ్లు వంటి వాటిని ఎంతో సౌకర్యవంతంగా రూపొందించారు. నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించారు.

ఇప్పటికే అందుబాటులో రెండు అర్బన్ హెల్త్ సెంటర్లు..

చీరాల పట్టణ ప్రజలకు నిత్యం వైద్య సేవలు అందుబాటులో ఉంటున్నాయి. కుందేరు వద్ద ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలతో పాటు వైకుంఠపురంలోని అర్బన్ హెల్త్ సెంటర్, మరియమ్మపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లు ప్రజలకు నిత్యం అందుబాటులో వైద్య సేవలందిస్తున్నాయి. దాదాపుగా చీరాల పట్టణం మొత్తాన్ని కుందేరు వద్దగల ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాల వైద్య సేవలందిస్తుంది. ఇక్కడ ప్రజలకు కావాల్సిన అనేక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. తల్లీబిడ్డల సీమాంక్ సెంటర్, కిడ్నీ డయాలసిస్ సెంటర్, రక్తనిధి కేంద్రం, ప్రమాదాల బారినపడిన సమయంలో మంచి వైద్య నిపుణులతో సర్జరీలు, పురుష, స్త్రీ వార్డుల రోగులకు నిత్యం అందుబాటులో ఉంటున్నాయి. రైలు పట్టాల అవతలి వైపుఉన్న దాదాపు 10 మున్సిపల్ వార్డుల జనాభాకు వైకుంఠపురం, మరియమ్మపేట అర్బన్ హెల్త్ సెంటర్లు వైద్య సేవలందిస్తున్నాయి. కొత్త అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఇద్దరు వైద్యులతో పాటు డ్యూటీ నర్సులు, టెక్నీషియన్లు, ల్యాబ్ అసిస్టెంట్లు, సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటారు. ప్రజలకు వైద్య సేవలు అందించే విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, తీసుకుంటున్న చర్యలపై ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

సేవా కార్యక్రమాల్లో రోటరీ ముందంజ



విజేతలకు బహుమతులందిస్తున్న నిర్వాహకులు

పర్చూరు (చినగంజాం): రోటరీ క్లబ్ పర్చూరు సెంట్రల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ రోటరీ ఆవిర్భావ దిన వేడుకలు శుక్రవారం స్థానిక భవనం వీరారెడ్డి రోటరీ భవనంలో ఘనంగా నిర్వహించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు నాగబైరు శ్రీనివాసరావు వేడుకలను ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన, రోటరీ వ్యవస్థాపకుడు పాల్ హారీశ్‌కు నివాళులర్పించి, కేక్ కటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా వివిధ వృత్తులకు సంబంధించిన వారిని ఆహ్వానించి సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు, క్విజ్ పోటీలు నిర్వహించారు. సీనియర్ సభ్యులు పాబోలు ఉదయభాస్కర్, క్విజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సమాజంలో రోటరీ నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలను గురించి మాట్లాడారు. అనంతరం ప్రముఖ సంఘ సేవకురాలు నర్రా లక్ష్మీ సుధ పోటీలలో ప్రతిభ కనబరచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పంబి సదానందరెడ్డి, సభ్యులు కోమటి ఆంజనేయులు, గడ్డిపాటి శ్రీనివాసరావు, కారుమూరి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ వ్రతాలు



వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

అద్దంకి రూరల్: శివపార్వతుల కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక భవానిసెంటర్‌లోని వింధ్యా వాసిని సమేత నగరేశ్వరస్వామి దేవస్థానంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో వత్రాల్లో పాల్గొన్నారు. రాత్రి ఉత్సవ విగ్రహాలతో పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. శనివారం శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు.

చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

బల్లికురవ: వేసవి దృష్ట్యా చిన్నారుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని ఆయుష్ వైద్యశాల అంబడిపూడి ఫార్మసిస్ట్ వీ. శేషసాయి కోరారు. శుక్రవారం చిన అంబడిపూడి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఎండల దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆరోగ్యం మేధాశక్తికి వాడాల్సిన మందులపై అవగాహన కల్పించారు. ఆయుర్వేద వైద్యం ప్రజల జీవనేదమని ఎలాంటి వ్యాధులకైనా నష్టాలు లేకుండా నయం చేసుకో వచ్చున్నారు. జలుబు దగ్గు నివారణకు మేధాశక్తి పెంపుదలకు చవన్‌ప్రాస్, ఆయుష్ 64 మందులను పాఠశాలలోని 25 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కావేరీబాయి పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, ఉత్తరాయనం, మాఘమాసం, మఖ నక్షత్రం, పౌర్ణమి తిథి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర శుక్రవారం తెలిపారు. శనివారం ఆంజనేయ స్వామికి ఇష్టమైన ఆకుపూజ చేస్తే కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు.

పొలాల్లో మోటార్లు చోరీ

బల్లికురవ: పంట పొలాల్లో మోటార్లు చోరికి గురయ్యాయి. బాధిత రైతులు శుక్రవారం బల్లికురవ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలోకి వెళితే మండలంలోని కొణిదెన పంచాయితీలోని గంగపాలెం గ్రామానికి చెందిన రైతులు గ్రామం నుంచి నల్లవాగువు వెళ్లే పొలాల్లో మోటార్లు అమర్చుకుని మొక్కజొన్న, కూరగాయాలు, వరి, పశుగ్రాసం సాగు చేస్తున్నారు. గురువారం అర్ధరాత్రి పథకం ప్రకారం రాయుడు శివ రామయ్య, అంజనేయులు, పోకూరి సుబ్బారావు, రమేష్, హోరుగడ్డ డేవిడ్‌కు సంబంధించిన మోటార్లు చోరీ చేశారు. వీటి విలువ రూ.2 లక్షల పైబలుకు ఉంటుందని రైతులు తెలిపారు. శుక్రవారం రైతులు మోటార్లు కనిపించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వైభవంగా కలశాల ఊరేగింపు



కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

వేటపాలెం: చౌడేశ్వరి అమ్మవారి ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా మహిళలచే వైభవంగా శుక్రవారం కలశాల ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపు యన్నం గురనాథం ఇంటి వద్ద నుంచి బయలుదేరి చౌడేశ్వరి అమ్మ వారి దేవస్థానం వద్దకు చేరుకుంది. అనంతరం అమ్మవారికి కుంకుమ పూజలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్న సంతర్పణ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి పూజలు చేశారు.

అన్నమాచార్య కీర్తనలు అజరామరం



అన్నమాచార్య విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాగేశ్వరరావు, దేవపాలన

అద్దంకి రూరల్: అన్నమాచార్య కీర్తనలు అజరామరం అని, ఆబాలగోపాలన్ని అలరిస్తాయని దాససాహిత్య భారతీయ జానపద కళాక్షేత్రం అధ్యక్షుడు చెన్నుపల్లి నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం తాళ్లపాక అన్నమాచార్య 152వ వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా అన్నమాచార్య విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈసందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ అన్నమాచార్య వెంకటేశ్వరస్వామి మీద 32 వేలకు పైగా కీర్తనలు రచించారన్నారు. కవితలు జానపదం, భక్తి సాహిత్యం నిండి ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఉబ్బా దేవపాలన, దామా హనుమంతరావు, చెన్నుపాటి రామాంజనేయులు, అన్నమనేని వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

హనుమంత వాహనంపై మదనగోపాలస్వామి



హనుమంత వాహనంపై స్వామివారు

చీరాల అర్బన్: పట్టణంలోని పేరాలలో వేంచేసియున్న మదనగోపాలస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాలను వైఖానస ఆగమశాస్త్రానుసారంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా శుక్రవారం హనుమంత వాహనంపై ఉత్సవమూర్తులను ఉంచి పట్టణంలో నగరోత్సవం చేవారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు. కార్యక్రమంలో దేవస్థాన 14వ వ్యవస్థాపక ధర్మకర్తలు జక్కా రమేష్, డాక్టర్ జక్కా మోహనమురళీధరరావు, అర్చకులు రావులకొల్లు వెంకటరంగాచార్యులు, రావులకొల్లు చెన్నకృష్ణమాచార్యులు, యాజ్ఞికులు తమిరిశ వంశీకృష్ణలు పాల్గొనగా ఉత్సవాలను కార్యనిర్వహణాధికారి బండ్ల శ్రీలత పర్యవేక్షించారు.